క్లుప్తంగా

30న సీతారాముల కల్యాణం

కర్నూలు కల్చరల్: శ్రీరామ నవమిని పురస్కరించుకొని వీఆర్ కాలనీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఈ నెల 30వ తేదీ ఉదయం 11.53 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం, పల్లకీ సేవ జరుగుతుందని పేర్కొన్నారు. గుత్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ క్లో వేణుగోపాల శర్మ వ్యాఖ్యానం చేస్తారని తెలిపారు. భక్తులు అందరూ పాల్గొనాలని కోరారు.

☛ సాయిబాబా భక్త మండలి ఆధ్వర్యంలో దక్షిణ షిరిడీ సాయిబాబ దేవస్థానంలో ఈ నెల 30న శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మండలి కార్యదర్శి మహాబలేష్ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కాగడ హారతి, విష్ణు సహస్రనామావళి, మహాభిషేకం, 10.30 గంటగలకు సీతారాముల కల్యాణం, సాయంత్రం 7 గంటలకు ఊంజల్‌సేవ, జెండా ఉత్సవం, చందనోత్సవం, పల్లకీ సేవ, రథోత్సవం, కోలాటం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి



ఆటో ప్రచారాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కర్నూల(సెంట్రల్): కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం బి.తాండ్రపాడులో చలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రచారం కల్పించేందుకు ఆటో యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో కార్మికులు, కర్షకులు తిండికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మోదీ మాత్రం ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ ఆస్తులను ఆదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సర్పంచ్ బాలపీర, రైతు సంఘం నాయకుల ఆంజనేయులు పాల్గొన్నారు.

31న మార్కెట్ కమిటీ సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం ఈ నెల 31న నిర్వహించనున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్ కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి సెక్రటరీ గోవిందు తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ అంచనాలను మార్కెట్ కమిటీ ఆమోదించనుంది. 2022–23లో మార్కెట్ కమిటీ సాధించిన ప్రగతిని కూడా సమీక్షిస్తారు.

మోదీ బెదిరింపులకు రాహుల్ భయపడడు

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బెదిరింపులకు రాహుల్‌గాంధీ భయపడరని మాజీ పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజనాథ్ పేర్కొన్నారు.మంగళవారం డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో రాహుల్‌గాంధీని నేరుగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం మోదీలో లేదని, అందుకనే దొడ్డిదారిన గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. పరువునష్టం దావా కేసును సాకుగా చూపి రాహుల్‌గాంధీ ఎన్నికల్లో పాల్గొనడానికి వీల్లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. కేసును కాంగ్రెస్ పార్టీ కోర్టుల ద్వారానే ఎదుర్కొంటుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు, నాయకులు కొత్తూరు సత్యనారాయణగుప్తా, బతుకన్న, బజారన్న పాల్గొన్నారు.

నేడు పౌరాణిక పద్య నాటకాల ప్రదర్శన

కర్నూలు కల్చరల్: శ్రీరామ నవమిని పురస్కరించుకొని శ్రీశైల భ్రమరాంబిక కళా సమితి ఆధ్వర్యంలో శ్రీరామ నగర్‌లోని శివాలయం ఆవరణలో బుధవారం రాత్రి 8 గంటలకు పౌరాణిక పద్య నాటకాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు సమితి అధ్యక్షులు డి.పుల్లయ్య తెలిపారు. దుర్యోధన ఏకపాత్రాభినయం పడక సీను, గయోపాఖ్యానం, శ్రీకృష్ణ తులాభారం, సత్యహరిశ్చంద్ర నాటకాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కళాకారులు, కళాభిమానులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: కబ్జా,బలగం,దాస్ కా ధమ్కీ, రంగమార్తాండ, జాన్ విక్ చాప్టర్–4,ఆరంజ్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : కబ్జా, ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, దాస్ కా ధమ్కీ, రంగమార్తాండ,ఖోస్తీ,గీతసాక్షిగా,ఆరంజ్,ఇష్క్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సార్, వినరో భాగ్యము విష్ణు కథ, దాస్ కా ధమ్కీ
ఐనాక్స్: తూ జూఠీ మై మక్కర్, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్, జాన్ విక్ చాప్టర్–4
రాజ్ : ఖోస్తీ
శ్రీరామ : ఆరంజ్
విజయ : జాన్ విక్ చాప్టర్–4

నాట్య 'సృజన'

- కూచిపూడి, భరత నాట్యంలో రాణిస్తున్న చిన్నారి
- ఎన్నో అవార్డులు, రికార్డులు కైవసం



సాధించిన మెమెంటోలు, మెడల్స్, సర్టిఫికెట్లను చూపుతున్న దృశ్యం



నృత్య ప్రదర్శన చేస్తున్న సృజన

కర్నూలు కల్చరల్: చిన్నతనం నుంచే నృత్యంపై మక్కువ. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కూచిపూడి, భరత నాట్యంలో రాణిస్తోంది పగిడ్యాల సృజన. ఇప్పటికే వందల సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చి పలు అవార్డులతోపాటు రికార్డులు నమోదు చేసింది. భరత నాట్యంలో వినాయక కౌత్వం, కూచిపూడిలో జనుత శబ్దంలో తన ప్రత్యేకత చాటుకుంటోంది. లింగాష్టకం, బ్రహ్మాంజలి నృత్యంలో తీరైన హావభావాలు పలికించి వీక్షకులను అలరిస్తోంది. కర్నూలు నగరం అరుంధతి నగర్‌కు చెందిన సృజన స్థానిక మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. తల్లి రమ్య ఉపాధ్యాయురాలు. తండ్రి వెంకటేశ్వర్లు ప్రైవేట్ బీఈడీ కళాశాలలో అధ్యాపకులు. కుమార్తె అభిరుచికి అనుగుణంగా చిన్నతనం నుంచే నృత్యంలో శిక్షణ ఇప్పిస్తున్నారు. నృత్య శిక్షకుడు కరీముల్లా వద్ద భరతనాట్యం, కూచిపూడిలో ప్రత్యేక శిక్షణ తీసుకుంది. గత ఐదేళ్లలో పలు ప్రాంతాల్లో 60కిపైగా ప్రదర్శనలు ఇచ్చి అందరి చేత శభాష్ అనిపించుకుంటోంది. మంచి నృత్య కారిణిగా రాణించడమే తన లక్ష్యమని సృజన పేర్కొంటుంది.

ప్రదర్శనలు.. ప్రశంసలు..

☛ 2018లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన నాట్య కళా నీరాజనం ప్రదర్శనలో న్యాటం చేసి కళా సౌరభం అవార్డు అందుకుంది.

☛ 2019 తిరుపతిలోని పద్మావతి కల్యాణ మండపంలో జరిగిన అలివేలి మంగకు నీరాజనం కార్యక్రమంలో నృత్యం చేసి సాంస్కృతిక ప్రదర్శనల్లో రికార్డు సొంతం చేసుకుంది. ఇమాజినింగ్ కిడ్స్ బెస్ట్ అవార్డును పొందింది.

☛ 2019లో తిరుపతిలోని శిల్పారామంలో జరిగిన నటరాజ నృత్య కళ ప్రదర్శనలో బాలనర్తకిగా పురస్కారం కైవసం చేసుకుంది.

☛ 2020లో చెన్నైలో త్యాగయ్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన లార్జెస్ కూచిపూడిలో గిన్నిస్ వరల్డ్ రికార్డు, హై ఇమాజింగ్‌బుక్ ఆఫ్ రికార్డ్, ఫెంటాస్టిక్ అచీవ్‌మెంట్ రికార్డు, ఇండియన్ రికార్డు, మార్వలెస్ బుక్స్ ఆఫ్ రికార్డు, హైరేంజ్ బుక్స్ ఆఫ్ రికార్డులను నమోదు చేసింది.

☛ 2022లో ఇందిరాగాంధీ మెమోరియల్ నగర పాలక సంస్థ పాఠశాలలో నిర్వహించిన కూచిపూడి నృత్యంలో మొదటి స్థానం సాధించి పురస్కారం అందుకుంది.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

- ఎస్‌డీపీ మిషన్‌ను ప్రారంభించిన కలెక్టర్



ఎస్‌డీపీ మిషన్ గురించి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావుకు వివరిస్తున్న డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌కు చెందిన విర్కో ఫౌండేషన్ వారు విరాళంగా అందించిన రూ.35లక్షల విలువగల సింగిల్ డోనార్ ప్లేట్‌లెట్(ఎస్‌డీపీ) మిషన్‌ను మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధిలో జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో రక్తదాన క్యాంపులు నిర్వహిస్తూ రక్తాన్ని సేకరిస్తూ, అవసరార్థులకు దానిని అందించి ప్రాణదాతలుగా నిలుస్తున్నారని అన్నారు. రక్తసేకరణ సమయంలో హాని కలిగించే వైరస్‌లను తక్షణమే గుర్తించగలిగే అధునాతన టెక్నాలజీతో తయారు చేసిన ఈ ఎస్‌డీపీ మిషన్ జిల్లాలో మొట్ట మొదటిసారిగా వినియోగించడం చాలా గర్వంగా ఉందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యులు శ్రీశైల మహాక్షేత్రంలో జరిగే మహాశివరాత్రి, ఉగాది పర్వదినాల్లో భక్తులకు ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఈ మేరకు వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛంద కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరం, ప్రథమ చికిత్సాశిబిరాలు, యువకులను ప్రోత్సహించేందుకు ప్రతి కాలేజీలో యూత్‌రెడ్ క్రాస్, జూనియర్ రెడ్‌క్రాస్ సొసైటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ మహేంద్రకుమార్, ట్రెజరర్ జె.రఘునాథరెడ్డి, జి.శ్రీనివాసులు, ఈసీ మెంబర్స్ డాక్టర్ కె.వి.సుబ్బారెడ్డి, జి. శ్రీనివాసులు, కె.అరుణ, మధుసూదన్, బాబురాజు, భీమశంకర్‌రెడ్డి, ఐ.నరసింహ, మీనాక్షి, పుల్లయ్య కాలేజి అధినేత జి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): హైరిస్క్ ఉన్న గర్భిణుల పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో మాతృమరణాలపై సమీక్ష నిర్వహించారు. హాలహర్వి, నన్నూరు పీహెచ్‌సీల పరిధిలో మార్చిలో సంభవించిన మాతృమరణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మరణాలు గర్భసంచి విచ్ఛిత్తి జరిగి రక్తస్రావం, అధిక రక్తపోటు కారణాలతో జరిగాయని కమిటీ నిర్ధారించింది. హైరిస్క్ గర్భవతులను వైద్యాధికారులతోపాటు క్షేత్రస్థాయిలోని ఆశా, ఆరోగ్య కార్యకర్తలు త్వరగా గుర్తించి సరైన సమయంలో వైద్యసేవలు అందిస్తే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చని ఆయన సూచించారు. ప్రతి నెలా 9వ తేదీన ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమాన్ని ప్రతి ఆరోగ్య కేంద్రంలో నిర్వహించాలన్నారు. ఇందులో గర్భవతులకు అన్ని వైద్యపరీక్షలు నిర్వహించి ఎంసీహెచ్ కార్డులో నమోదు చేయాలన్నారు. హైరిస్క్ గర్భవతులను గుర్తించి వారిని ఆశాలు, ఆరోగ్యకార్యకర్తల పర్యవేక్షణలో ప్రసవానికి వారం ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి సుఖ ప్రసవం అయ్యే విధంగా చూడాలన్నారు. సమావేశంలో గైనకాలజి హెచ్‌వోడీ డాక్టర్ వెంకటరమణ, డీఐవో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ సుజాత పట్నాయక్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ సుధీర్ కుమార్, డాక్టర్ రసూల్ అహ్మద్, డీపీహెచ్‌ఎన్‌వో లిన్నెట్ లిడియా పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య మంగళవారం పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోదకాలు వ్యాధిగ్రస్తులకు ఆరుగురికి మార్బిడిటి మానిటరింగ్ కిట్‌లను అందజేశారు. బోదకాలు వ్యాధిగ్రస్తులు తరచూ వ్యాధిసోకిన కాలును టబ్‌లో ఉంచి సబ్బు నీటితో శుభ్రంగా కడిగి టవల్‌తో తుడిచిన తర్వాత ఆయింట్‌మెంట్ పట్టించాలని ఆయన సూచించారు. ఆసుపత్రికి రాకుండానే ఇంటి వద్దనే జాగ్రత్తలు పాటించవచ్చని చెప్పారు. వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం నన్నూరు పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి అన్ని ప్రోగ్రామ్ లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఫేషియల్ రికగ్నేషన్ యాప్ ద్వారా సిబ్బంది తప్పనిసరిగా హాజరువేయాలని చెప్పారు. ఈడీడీ క్యాలెండర్‌లో ఉన్న ప్రమాదకర గర్భవతులను ప్రసవానికి ఒక వారం ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి సుఖప్రసవం అయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట డీఎంవో నూకరాజు, ఏఎంవో చంద్రశేఖర్, వైద్యాధికారులు, ఆరోగ్యపర్యవేక్షకులు, సిబ్బంది ఉన్నారు.

మహిళాభ్యున్నతికి సీఎం కృషి





మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, ఆసరా ఉత్సవాలకు హాజరైన జనం

- మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని
- శరీన్‌నగర్‌లో ఆసరా సంబరాలు

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళాభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నారని కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నగర్ మేయర్ బీవై రామయ్య, నంద్యాల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్ పార్కులో ఆసరా సంబరాలు నిర్వహించారు. 19, 20, 21, 26, 29, 30, 31వ వార్డులలోని మొత్తం 657 పొదుపు సంఘాల మహిళలకు రూ.4.42 కోట్ల రుణాలను మాఫీ చేశారు. ఈ సందర్భంగా మేయర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ పొందిన రుణాలతో మహిళలు మెరుగైన జీవనోపాధులను కల్పించుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్ప పాదయాత్రలో పొదుపు మహిళలకు 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న రుణాలన్ని మాఫీ చేస్తానన్ని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట మేరకు ఇప్పటికే మూడో విడత ఆసరా పథకం అమలు చేస్తున్నారని చెప్పారు. అమ్మఒడి, ఆసరా, సున్నావడ్డీ, వసతి దీవెన, విద్యా దీవెన, విద్యాకానుక మొదలగు పథకాలతో ఎంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కేవలం జన్మభూమి కమిటీ సిఫారసులు చేసిన వారికే అందేవన్నారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పార్టీలు, కులమతాలు, రాజకీయాలకు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఉన్న తేడాను ప్రజలు గమనించాలన్నారు. అనంతరం మహిళలకు చెక్కును పంపిణీ చేశారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, పలువురు కార్పొరేటర్లు, మెప్మా పీడీ నాగ శివలీల, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, టీఎమ్‌సీ సుధాకర్, సీఎంఎం జయవర్ధన్, సీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఒంటి పూట బడులు నిర్వహించాలి

కర్నూలుకల్చరల్: జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఒంటి పూడ బడులు నిర్వహించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో కార్యాలయం ఏడీ శ్యాముయ్యల్ పాల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీములు గౌడ్ పేర్కొన్నారు. చాలా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఎండలోనే తింటూ కుప్పకూలి పోతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒంటి పూట బడులు నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఒంటి పూట బడుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, మునిస్వామి, నాయకులు విజయ్, అనిల్ తదితరులు వినతి పత్రం ఇచ్చినవారిలో ఉన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ. హాఫీజ్ ఖాన్ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మంగళవారం స్థానిక ఒకటవ వార్డులోని బుడ్డాబుడ్డీ మసీదులో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నిర్వాహకులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ముస్లిం సోదరులతో కలసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ షాషావలి, పార్టీ నాయకులు గఫార్ ఖాన్, రియాజ్ బాబా, షబ్బీర్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

31న ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలోని ప్రభుత్వ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఈనెల 31వ తేదీన కర్నూలులో రాష్ట్ర స్థాయిసదస్సును నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఏఐవైఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీక్యాంపులోని లలిత కళా సమితిలో నిర్వహించే సదస్సుకు జాతీయ, రాష్ట్రీయ నాయకులు హాజరు కానున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాల భర్తీని మరచిపోయిందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, బీసన్న మునిస్వామి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధి తడకనపల్లె గ్రామంలో విద్యుదాఘాతంతో బి.రాజశేఖర్(21) మృతి చెందాడు. ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాలు... నంద్యాల జిల్లా డోన్ మండలం వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన బెల్దార్ బి.రాజశేఖర్ తడకనపల్లెలో బంధువుల ఇంటి నిర్మాణ పనికి వచ్చాడు. మంగళవారం ఉదయం ఇంటి నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నల్లప్ప తెలిపారు.

పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో రెండోరోజు సీపీఐ ఆధ్వర్యంలో పెండింగ్ ప్రాజెక్టులను చేపట్టాలని నిరసన సదస్సు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లాలో హంద్రీనీవా, గాలేరు–నగరి, గురురాఘవేంద్ర, వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను చేపట్టాలన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అరుణాచలంకు మరో ప్రత్యేక బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): తమిళనాడులోని అరుణాచల క్షేత్ర దర్శనం కోసం సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సును నడుపుతున్నట్లు కర్నూలు–1 డిపో అసిస్టెంట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఈ బస్సు కర్నూలు నుంచి బయలుదేరి మరుసటి రోజు (6వ తేదీ) ఉదయం 6 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం 4 గంటలకు బస్సు బయలుదేరి మార్గమధ్యలో వేలూరు స్వర్ణ దేవాలయం దర్శనం అనంతరం బస్సు బయలుదేరి 7వ తేదీ ఉదయం 6 గంటలకు కర్నూలు చేరుకుంటుందని అన్నారు. ఈ సూపర్ లగ్జరీ బస్సులో రానుపోను చార్జీ రూ.2 వేలు ఉంటుందని, ముందస్తు టిక్కెట్లు పొందేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. వివరాలకు 7702774358 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పార్కు స్థలాల్లో ఆక్రమణలు తొలగించండి

కల్లూరు: కర్నూలు నగరం నాలుగవ తరగతి కాలనీలోని పార్కు స్థలాలలో ఆక్రమణలు తొలగించి, ఫ్యామిలీ పార్కును ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాలుగవ తరగతి హౌస్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో రాణించాలి



జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న రాష్ట్ర జట్టు హ్యాండ్‌బాల్ క్రీడాకారులు

కర్నూలు (టౌన్): ఈ నెల 31న గౌహతిలో నిర్వహించనున్న 37వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు రాణించాలని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు ఆకాంక్షించారు. మంగళవారం ఆయన రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారుల పేర్లను ప్రకటించారు. ఎంపికైన వారిలో జస్వంత్, నరేష్, దస్తగిరి, సాహెబ్, లక్ష్మీనారాయణ, చరణ్, శ్రవణ్, వేణుబాబు, సాయికిరణ్, శ్రవంత్, ఆదిశేషు, విశ్వనాథ్, అభిరామ్, కుమార్, రేవంత్, దిలీప్‌లు ఉన్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు గత నెల డిసెంబర్ 18, 19 తేదీలలో కృష్ణాజిల్లా గన్నవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచారన్నారు.

యోగా పోటీల్లో ఏపీకి పతకాలు



పతకాలు సాధించిన యోగా క్రీడాకారులు

కర్నూలు (టౌన్): రాజస్థాన్ రాష్ట్రంలోని పాలి పట్టణంలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన 47వ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు యోగా క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో ఏపీకి 7 పతకాలు వచ్చినట్లు యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి మంగళవారం వెల్లడించారు. పతకాలు సాధించిన వారిలో లలనా ప్రియ (కర్నూలు), టి.శిరీషా (పశ్చిమగోదావరి), సత్యప్రసాద్‌రాజు, విజయవాడ, నవీన్ (విజయవాడ), కావ్య (నెల్లూరు) ఉన్నారన్నారు.

ఆమోదయోగ్యమైన సర్వీస్ రూల్స్ రూపొందించాలి

కర్నూలు కల్చరల్: మున్సిపల్ ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమైన సర్వీస్ రూల్స్ రూపొందించాలని ఏపీ ఎమ్‌టీఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం కార్యాలయంలో మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక పరిధిలో ఉన్న పాఠశాలలను విద్యాశాఖ పరిధిలోకి పరిపాలన, పర్యవేక్షణ నిమిత్తం ఉత్తర్వులు ఇచ్చి తొమ్మిది నెలలు గడిచినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు. మున్సిపల్ ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, నగర శాఖ అధ్యక్షులు శ్యాంసుందర్, నాయకులు నిర్మల్ కుమార్, రామచంద్రారెడ్డి, మురళి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్, ముంతాజ్ బేగం, విజయమ్మ, నీలిమ తదితరుల పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు మెమోలు

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ మంగళవారం మెమోలు జారీ చేశారు. మార్చి నెల ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా ఇప్పటికీ ఆస్తి పన్ను, నీటి పన్ను సక్రమంగా వసూలు చేయకపోవడంతో వారికి మెమోలు జారీ చేశారు. మూడు రోజుల్లో సరైన సమాధానం ఇవ్వకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. మెమోలు జారీ చేసిన వారిలో సచివాలయం ఉద్యోగులు ఎం.నరేష్‌కుమార్, నందనాయక్, మోహన్, మహబూబ్ ఖాదర్, నాగేంద్ర, శివ, అరవింద కుమార్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సొమ్యలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత నవరాత్రి ఉత్సవాలు



సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఏడో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి అభిషేకం, ప్రత్యేక అలంకరణతో దర్శనం కల్పించారు. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు.

'ఐఎన్‌టీఎస్‌వో'లో ప్రతిభ

కర్నూలు కల్చరల్: దేశ వ్యాప్తంగా ఈ నెల 25వ తేదీన 3 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌వో పరీక్షలో చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ఏజీఎం జి.సురేష్ తెలిపారు. ముగ్గురు విద్యార్థులు ల్యాప్‌టాప్‌లు, గ్రాండ్ ప్రైజ్‌లు సాధించారన్నారు. 20 మందికి ట్యాబ్‌లు, 125 మంది ర్యాంకులతో మెడల్స్ సాధించారని తెలిపారు.